11, 12 తేదీల్లో దసరా పండగ

రాయదుర్గం: టెలికాంనగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో 11,12 తేదీల్లో రెండురోజుల పాటు దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి తెలిపారు. 11న ఉదయం 6 గంటలకు సాయిబాబాకు కాగడ హారతితో ప్రారంభిస్తారు. అనంతరం 7.30 నుంచి 9 గంటల వరకు సాయిబాబా ,దత్తాత్రేయస్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం పల్లకీసేవ ఉంటుందన్నారు. అనంతరం జమ్మి పూజ జరుగుతుందన్నారు.

ఆధార్‌ అప్‌డేట్‌, సవరణలకు అవకాశం

ఆల్విన్‌కాలనీ: ఆధార్‌ వివరాలు సరి చేయడంతో బాటు, అప్‌డేట్‌ చేసుకోవచ్చని వివేకానందనగర్‌ రెసిడెంట్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు పేర్కొన్నారు. వార్డు ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్‌ అప్‌డేట్‌, మార్పులు, చేర్పులు చేయనున్నట్లు సభ్యులు తెలిపారు. 10 సంవత్సరాల క్రితం హైదరాబాద్‌ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఆధార్‌ పొందిన వారు తమ ఆధార్‌ను ప్రస్తుతం తప్పకుండా అప్‌డేట్‌ చేయించుకోవాలని తెలిపారు. చిరునామా మార్పునకు విద్యుత్‌ బిల్లు, పాస్‌పోర్టు, పేరు సవరణ కోసం పాన్‌ కార్డు, డ్రైవింగ్‌ లైసెన్స్‌ ఇతర ప్రభుత్వ గుర్తింపు పత్రాలు తీసుకురావాలని తెలిపారు. అన్ని పత్రాల ఒరిజినల్‌ కాపీలు ధ్రువీకరణ కోసం తెచ్చుకోవాలన్నారు.

సైబర్‌ నేరాలపై అవగాహన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సైబర్‌ నేరాలపై ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులకు రామచంద్రాపురం పోలీసులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఐ శశికాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, గుర్తు తెలియని లింక్‌లు వస్తే వాటిని ఓపెన్‌ చేయొద్దని సూచించారు.


జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు


రాజరాజేశ్వరీమాతకు గాయత్రీదేవి అలంకారం


రాయదుర్గంలో.. అన్నపూర్ణాదేవిగా ఊరపోచమ్మ


కొత్తగూడలో.. కట్టమైసమ్మకు అన్నపూర్ణాదేవి అలంకారం


గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో గాయత్రీదేవిగా అమ్మవారు

గాయత్రీదేవిగా..


ఖాజాగూడలో ముత్యాలమ్మతల్లి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. చండీ హోమం, నవచండీ హోమాలు చేస్తున్నారు. గచ్చిబౌలి, కొండాపూర్‌, కొత్తగూడ, ఖాజాగూడ సాయిఐశ్వర్య కాలనీ,రాయదుర్గం, జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌, గచ్చిబౌలి, టెలికామ్‌నగర్‌, నానక్‌రాంగూడ, మసీదుబండ ప్రాంతాలలో అమ్మవారి ఆలయాల్లో, మండపాల వద్ద అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు, లలిత సహస్ర నామ పారాయణం చేస్తున్నారు. భక్తులతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. – గచ్చిబౌలి/రాయదుర్గం


రాయదుర్గంలోని మండపం వద్ద..


సాయిఐశ్వర్య కాలనీలోని ముత్యాలమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు


తారానగర్‌ మతాయాత్‌ అసోసియేషన్‌ మండపంలో కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌


రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో..


మసీదుబండలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో.. స్థానిక నాయకులు

హైడ్రాకు ఫిర్యాదు

శేరిలింగంపల్లి: కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ హైడ్రా కమిషనర్‌కు సీపీఐ (ఎం) శేరిలింగంపల్లి కార్యదర్శి సి.శోభన్‌ శనివారం ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌ సర్వే నంబర్‌ 41/14లో దాదాపు 250 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా గత ప్రభుత్వ హయాంలో కార్పొరేట్‌ హాస్పిటల్స్‌, రియల్‌ ఎస్టేట్‌ సంస్థలకు కొంతభాగం కేటాయించారని పేర్కొన్నారు. ఇటీవల ఎకరం భూమిలో నిర్మాణలు చేస్తున్నారని, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అనుమతులు ఎలా వచ్చాయో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్‌ చేశారు. ఈ విషయంపై గతంలో తాము రెవెన్యూ అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం) కార్యవర్గ సభ్యులు కృష్ణ, మాణిక్యం, వరుణ్‌ తదితరులు పాల్గొన్నారు.

మంజీరా రోడ్డు పనులకు శంకుస్థాపన


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధి మంజీరా పైప్‌లైన్‌ నూతన రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ శనివారం శంకుస్థాపన చేశారు. వినాయక్‌నగర్‌, ఆర్టీసీ కాలనీ వద్ద సుమారు రూ.4.31 కోట్లతో చేపట్టనున్న రోడ్డు పనులకు నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌ గౌడ్‌, కార్పొరేటర్‌ పూజితగౌడ్‌లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హఫీజ్‌పేట్‌ ఫ్లైఓవర్‌ నుంచి మై హోమ్‌ జ్యువెల్‌ వెనుక గేట్‌ వరకు, ఆర్టీసీ కాలనీ నుంచి జాతీయ రహదారి వరకు సీసీ రోడ్డు వేయనున్నామన్నారు. మంజీర రోడ్డు సమస్యకు నేటితో పరిష్కారం లభించిందన్నారు. పనుల్లో నాణ్యత తప్పనిసరి అని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో సర్కిల్‌ –21 ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి, ఈఈ రాజు, డీఈలు, ఏఈలు, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు గౌతమ్‌గౌడ్‌, అక్తర్‌, ప్రసాద్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.

బైక్‌ అదుపుతప్పి.. వ్యక్తి మృతి

గచ్చిబౌలి: బైక్‌ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్‌ రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖైరతాబాద్‌లో నివాసముండే కారు డ్రైవర్‌ అంతంగారి పవన్‌(40) బైక్‌పై బంజారాహిల్స్‌ నుంచి కొల్లూరుకు బయలుదేరాడు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో వట్టినాగులపల్లి ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌ రోడ్డులో స్పీడ్‌ బ్రేకర్‌ వద్ద అదుపుతప్పి కిందపడిపోయాడు, తీవ్ర గాయాలు కావడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


అనురాజ్‌ గగోయ్‌ (ఫైల్‌)

గచ్చిబౌలి: డ్యూటీకి వెళుతున్నానంటూ ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ నాగేశ్వర్‌ రెడ్డి తెలిపిన ప్రకారం ..అసోంకు చెందిన అనురాజ్‌ గగోయ్‌(33) వట్టినాగులపల్లిలో నివాసం ఉంటూ కోకాపేట్‌లోని ఘర్‌(జీఏఆర్‌)లో సెక్యూరిటీ ఇంచార్జీగా పని చేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీ ఉదయం 9.30 గంటలకు డ్యూటీకి వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంపెనీలో వాకబు చేయగా డ్యూటీకి రాలేదని చెప్పారు. పలుప్రాంతాలలో వెదికినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య బ్యూలా బైలుంగ్‌ ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవ దుర్గా నమోస్తుతే ..

ఆకట్టుకున్న అవతారిణి కూచిపూడి నృత్యరూపకం.. శారీస్‌ ఆఫ్‌ ఇండియా





మాదాపూర్‌: శిల్పారామంలో దసరా ఉత్సవాలు, శారీస్‌ ఆఫ్‌ ఇండియా, బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం బెంగుళూరుకి చెందిన భరతనాట్య గురువు ఆశకుమార్‌ శిష్యబృందం భవ్య, సంజన, శరణా, గానవి, హంస, గగనలు రాజరాజేశ్వరీ అష్టకం, మహాదేవ శివశంభో, మాతే తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కలర్స్‌ ఆఫ్‌ డ్యాన్స్‌ అకాడమీ గురువు ఎంఎస్‌ఎల్‌ ప్రవీణ అవతారిణి కూచిపూడి నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. ఇందులో పూర్వరంగం, గణేశ ప్రార్థన, బాలాత్రిపురసుందరి, గాయత్రీదేవి, అన్నపూర్ణాదేవి, లలితాత్రిపుర సుందరి, శ్రీలింగ భైరవి దేవి, శ్రీ మహాలక్ష్మీదేవి, సరస్వతీదేవి, శ్రీ దుర్గాదేవి తొమ్మిదిమూర్తుల ను ప్రదర్శించారు. శిల్పారామంలో ఏర్పాటు చేసిన ట్రైబల్‌ ఆది మహోత్సవ ఎగ్జిబిషన్‌ ఆకట్టుకుంటోంది.

తెలంగాణ ఐకాన్‌ అవార్డుల ప్రదానోత్సవం


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర మాజీ ముఖ్య ప్రధానకార్యదర్శి అజయ్‌మిశ్రా

రాయదుర్గం: విభిన్న రంగాలలో ప్రతిభ చాటిన వారిని ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీహబ్‌ ప్రాంగణంలో శనివారం తెలంగాణ ఐకాన్‌ అవార్డుల పేరిట ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూ ట్యూబర్లు, బ్లాగర్లు, ఇతరులకు అవార్డులను అందించారు. తెలంగాణ మాజీ సీఎస్‌ అజయ్‌మిశ్రా జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తెలంగాణ ఐకాన్‌ అవార్డుల రెండో ఎడిషన్‌ కార్యక్రమంలో విభిన్న రంగాల వారికి అవార్డులు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీస్‌ కమిషన్‌ చైర్మన్‌ తారీఖ్‌ అన్సారీ, ఏఐసీసీ కిసాన్‌ కాంగ్రెస్‌ జాతీయ సమన్వయకర్త మహ్మద్‌ ఖలీకర్‌ రెహమాన్‌, బీఎస్‌ఐ హైదరాబాద్‌ ఈడీ సంజనా షా, తెలంగాణ బ్లాగర్స్‌ కమ్యూనిటీ వ్యవస్థాపకుడు అబ్దుల్‌ మొయిద్‌ ,విజిట్రాన్‌ ఫ్యాషన్‌ లైఫ్‌స్టైల్‌ ఎంటర్‌టైన్‌మెంట్‌ ఎంఆర్‌ నజీమ్‌షేక్‌ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ పూజిత జగదీశ్వర్‌గౌడ్‌

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ను పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్‌ పూజిత జగదీశ్వర్‌గౌడ్‌ పేర్కొన్నారు. శనివారం డివిజన్‌ పరిధిలోని ఓల్డ్‌ హఫీజ్‌పేట్‌ గ్రామంలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓల్డ్‌ హఫీజ్‌పేట్‌ గ్రామం నుంచి కాయిదమ్మ కుంట చెరువు వరకు సుమారు రూ.46.50 లక్షలతో నూతనంగా సీసీ రోడ్డు నిర్మించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానికులు యాదగిరి గౌడ్‌, ముజీబ్‌, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు


కార్యక్రమంలో పాల్గొన్న గోవర్ధన్‌గౌడ్‌

శేరిలింగంపల్లి: బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది గోవర్ధన్‌గౌడ్‌ తెలిపారు. శనివారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు గోపీనగర్‌లో ఇంటింటికి తిరుగుతూ పార్టీ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు, మహిళలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సభ్యత్వాన్ని స్వీకరిస్తున్నారన్నారు.

కల్యాణలక్ష్మీ, షాదీముబారక్‌ చెక్కులు పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేదలకు అండగా కాంగ్రెస్‌ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. శనివారం రామచంద్రాపురం పట్టణంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో 49మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్‌ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ సంగ్రామ్‌రెడ్డి, కార్పొరేటర్‌లు పుష్పనగేష్‌, సింధు ఆదర్శ్‌రెడ్డి, తెల్లాపూర్‌ మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ రాములు గౌడ్‌, కౌన్సిలర్‌లు రవీందర్‌ రెడ్డి, శంషాబాద్‌ రాజు, ఆర్‌ఐ శ్రీకాంత్‌, కాంగ్రెస్‌ పార్టీ తెల్లాపూర్‌ మున్సిపల్‌ అధ్యక్షులు ప్రభాకర్‌ రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌ రెడ్డి, ఐలేష్‌, పరమేష్‌, మల్లేష్‌ పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కొండ విజయ్‌ కుమార్‌

చందానగర్‌: హోప్‌ ఫౌండేషన్‌ అంటే పేదలకు భరోసా అని ఎమ్మెల్యే గాంధీ, ఎమ్మెల్సీ ప్రొఫెసర్‌ కోదండరాంలు అన్నారు. శనివారం చందానగర్‌ గంగారంలోని హోప్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో 100 వారం అన్నదానం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం గొప్పదని అన్నారు. పలు సామాజిక కార్యక్రమాలు చేస్తున్న కొండ విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్నామన్నారు. మాజీ కార్పొరేటర్‌ అశోక్‌ గౌడ్‌, లక్ష్మీ నారాయణగౌడ్‌, రఘునాథ్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్‌, గౌతమ్‌గౌడ్‌ పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకలు

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఉన్నత విద్యాసంస్థల్లో వైభవంగా నిర్వహించుకున్నారు. హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ ఏబీవీపీ హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా 'బతుకమ్మ' పోస్టర్‌ ప్రదర్శనలో వేడుకల ప్రాధాన్యత, పూల పండుగపై అవగాహన కల్పించారు.

సెయింట్‌ జేవియర్స్‌ పీజీ కళాశాలలో..

గోపన్‌పల్లిలోని సెయింట్‌ జేవియర్స్‌ పీజీ కళాశాలలో ప్రిన్సిపల్‌ డాక్టర్‌.రవి పర్యవేక్షణలో రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు.

బీహెచ్‌ఈఎల్‌ టౌన్‌షిప్‌లో ..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్‌ టౌన్‌షిప్‌లో ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారుచేశారు. బతుకమ్మ ఆటపాటలతో కళాశాలలో పండగ వాతావరణం నెలకొంది.


గోపన్‌పల్లిలోని సెయింట్‌ జేవియర్స్‌ పీజీ కళాశాలలో..


బీహెచ్‌ఈఎల్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో..

నిర్వహణ నిల్‌..

- వాటర్‌ ఏటీఎంలు నిరుపయోగం
- పట్టించుకోని అధికారులు


వాటర్‌ ఏటీఎంలో విరిగిపోయిన కుళాయి

చందానగర్‌: ప్రజల సౌకర్యార్థం లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన వాటర్‌ ఏటీఎంలు నిర్వహణలోపంతో నిరుపయోగంగా మారాయి. ప్రజల దాహార్తి కోసం జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా వాటర్‌ ఏటీఎంలు ఏర్పాటు చేశాయి. రూపాయి నాణెం వేస్తే మిషన్‌ ద్వారా తాగునీరు వస్తుంది. చందానగర్‌లో జన సంచారం ఎక్కువగా ఉన్న చోట ఒక కేంద్రం, మరొకటి పీజేఆర్‌ స్టేడియం వద్ద ఏర్పాటు చేశారు. పీజేఆర్‌ స్టేడియంలోకి వచ్చే క్రీడాకారులు, వాకర్స్‌కు వాటర్‌ ఏటీఎం ఎంతో ఉపయోగకరమని ప్రధానంగా అక్కడ ఏర్పాటు చేశారు. కొన్ని నెలల పాటు వాటర్‌ ఏటీఎంలు పనిచేశాయి. ఆ తర్వాత వాటి నిర్వహణ పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. వాటర్‌ ఏటీఎంల నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వాటర్‌ ఏటీఎంలను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



చందానగర్‌ పీజేఆర్‌ స్టేడియం ముందు నిరుపయోగంగా ఉన్న వాటర్‌ ఏటీఎం సెంటర్‌


జీహెచ్‌ఎంసీ చందానగర్‌ సర్కిల్‌ కార్యాలయం పక్కన నిరుపయోగంగా ఉన్న వాటర్‌ ఏటీఎం సెంటర్‌

అందుబాటులోకి తేవాలి



చందానగర్‌లో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ ఏటీఎంలను బాగుచేసి అందుబాటులోకి తీసుకురావాలి. పీజేఆర్‌ స్టేడియంలో క్రీడాకారులు, వాకర్స్‌కు ఇవి ఎంతో ఉపయోగకరం. బయట వాటర్‌ బాటిల్స్‌ కొనాల్సి వస్తోంది.

–విష్ణువర్ధన్‌చారి, చందానగర్‌

నిర్వహణ లేదు



ప్రజల కోసం ఏర్పాటు చేసిన వాటర్‌ ఏటీఎంల నిర్వహణ లేదు. లక్షల రూపాయలు వెచ్చించి వాటిని పట్టించుకోకపోవడం తగదు. వెంటనే అధికారులు స్పందించి వాటర్‌ ఏటీఎంలను అందుబాటులోకి తీసుకురావాలి.

–బాలకృష్ణ, చందానగర్‌

మ్యాన్‌హోల్‌ మరమ్మతులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌ పరిధిలోని ఏఎస్‌ రాజు నగర్‌ కాలనీలో మ్యాన్‌హోల్‌ కుంగిపోవటంతో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ పనులను శనివారం పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాన్‌హోల్‌ వైపు ఎవరూ వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయినేని చంద్రకాంత్‌రావు, ప్రసాద్‌ కాలనీవాసులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం


అలెన్‌ విద్యా సంస్థల ప్రారంభోత్సవంలో పుల్లెల గోపీచంద్‌

మాదాపూర్‌: అలెన్‌ కెరీర్‌ ఇన్‌స్టిట్యూట్‌ క్రమశిక్షణకు మారుపేరు అని బ్యాడ్మింటన్‌ చీఫ్‌ కోచ్‌ పుల్లెల గోపీచంద్‌ తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో హైదరాబాద్‌లో ఐదు అలెన్‌ విద్యా శిక్షణ సంస్థలను శనివారం అక్షర విద్యాసంస్థల చైర్మన్‌, అలెన్‌ సంస్థ సీఈఓ నితిన్‌ కుక్రేజాలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థల సీఈఓ నితిన్‌ కుక్రేజా మాట్లాడుతూ వచ్చే మూడు సంవత్సరాలలో 20వేల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యా శిక్షణ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత అనుప్‌ యమ, సౌత్‌ఇండియా హెడ్‌ మహేశ్‌యాదవ్‌, అలెన్‌, అక్షర సిబ్బంది పాల్గొన్నారు.